క్లుప్తంగా

ఎయిడెడ్ పాఠశాలలపై డీఈవో దృష్టి సారించాలి

ఒంగోలు: ఎయిడెడ్ పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ దృష్టిసారించాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో చాలా పాఠశాలలు ఒకే టీచర్‌తో బోధన చేస్తున్నారని, అనేక పాఠశాలలకు గుర్తింపు లేని కారణంగా ఉపాధ్యాయులపై భారం పడుతుందన్నారు. వసతులు లేని, విద్యార్థులు లేని పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారి ముగ్గురు సభ్యుల కమిటీ రిపోర్టు అమలుచేయాలన్నారు. జిల్లాలో అనధికారికంగా నడుపుతున్న 8, 9, 10 తరగతులను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

మృతి చెందిన కానిస్టేబుల్‌కు నివాళులు



నివాళులర్పిస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: ఒంగోలు యూనియన్ బ్యాంక్‌లో పనిచేస్తూ సర్వీస్ గన్ ఫైర్ కావడంతో మృతి చెందిన చీమకుర్తికి చెందిన కానిస్టేబుల్ మర్రిపూడి వెంకటేశ్వర్లు మృతదేహానికి మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి పూలమాలతో నివాళులర్పించారు. చీమకుర్తి రామ్‌నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు జాలాది



జాలాది చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఒంగోలు టౌన్: వేలాది మంది విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించిన ఉత్తమ ఉపాధ్యయులు జాలాది వెంకట సుబ్బారావు జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని రచయిత డాక్టర్ మోగిలి దేవ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం జాలాది వెంకట సుబ్బారావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవ మాట్లాడుతూ..తన జీతం నుంచి ఎంతో మంది పేద విద్యార్థులకు చదువు చెప్పి వారి ఉజ్వల భవిష్యత్తు కోసం సాయపడిన గొప్ప మానవతా వాది సుబ్బారావు లాంటి ఉపాధ్యాయులు నేడు చాలా అరుదన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో జాలాది మోహన్ బాబు, గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, ఉప కార్యదర్శి బొమ్మల కోటేశ్వరి, నున్నా ఆంజనేయులు, డీవీ సుబ్బారావు, చిత్రకారుడు తిమ్మిరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు వదిలి బయటకు వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలి

ముండ్లమూరు: గ్రామాల్లో ప్రజలు తమ అవసరాల కోసం ఇంటిని వదిలి బయటకు వెళ్లినప్పుడు దొంగలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎల్.సంపత్‌కుమార్ సూచించారు. మండలంలోని పోలవరం, నాయుడుపాలెం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు దొంగతనాలపై అవగాహన కల్పించారు. ఇంట్లో విలువైన అభరణాలు, నగదు ఉంచి ఇతర ప్రాంతాలకు వెళ్లడం సరైంది కాదన్నారు. పక్కింటి వారికి తెలియజేయడంతో పాటు గ్రామ మహిళా పోలీసులకు సమాచారం ఇస్తే మంచిదన్నారు. ఆన్‌లైన్ మోసాలు, ఏటీఎం మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నూతన వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు.

కుమారుడితో సహా మహిళ అదృశ్యం

ఒంగోలు టౌన్: కుమారుడితో సహా ఓ మహిళ అదృశ్యమైనట్లు తాలుకా పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. చీమకుర్తి గ్రామానికి చెందిన తిరగబత్తిని అశోక్‌కు పేర్నమిట్ట గ్రామానికి చెందిన సుజాతతో తొమ్మిదేళ్ల క్రితం పెద్దల సమక్షంలో వివాహమైంది. వారికి ఒక బాబు ఉన్నాడు. 15 రోజుల క్రితం భార్యా భర్తలిద్దరి మధ్య చిన్న గొడవ జరిగింది. దాంతో ఆమె అలిగి పుట్టింటికి వెళ్లి పోయింది. పెద్దలతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకున్న అశోక్ పది రోజులుగా అత్తగారింట్లో ఉన్న భార్య దగ్గరికి వచ్చి పోతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం భార్యను తనతో తీసుకొని వెళ్లేందుకు అనుమతి తీసుకున్నాడు. అయితే మంగళవారం ఉదయం అశోక్‌కు ఫోన్ చేసిన అతని బావమరిది సుజాత కనిపించడం లేదని చెప్పాడు. చుట్టుపక్కల వారిని అడిగినా ఎలాంటి సమాచారం లేకపోవడంతో అశోక్ తాలుకా పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగేళ్లపాటు నిరంతరం సంక్షేమం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

- సంక్షేమ పథకాలు కొనసాగేందుకు మళ్లీ జగనన్నను సీఎం చేసుకుందాం
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- చీమకుర్తి 19, 20 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం

చీమకుర్తి: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన గత నాలుగేళ్ల నుంచి నిరంతరం సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందిస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం చీమకుర్తి మున్సిపాలిటీలోని 19, 20 వార్డుల్లో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి బూచేపల్లి వెంకాయమ్మతో పాటు మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గడప గడప కార్యక్రమంలో సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులతో వారు మాట్లాడుతూ సీఎం అందిస్తున్న సంక్షేమ పథకాలు రానున్న రోజుల్లో కూడా ఇలాగే కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుందామని విజ్ఞప్తి చేశారు. పార్టీలకతీతంగా వలంటీర్ల ద్వారా పారదర్శకంగా సీఎం అందిస్తున్న సంక్షేమ పథకాల నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోనే జమచేస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి ఇంట్లో మూడు నాలుగు పథకాలకు తక్కువ కాకుండా ప్రయోజనం పొందారన్నారు. సరాసరిన ప్రతి ఇంటికి ఇంటి స్థలం, జగనన్న కాలనీతో కలుపుకొని రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ప్రయోజనం పొందారని గుర్తు చేశారు. ఇంత పెద్ద మొత్తంలో గతంలో ఏ ప్రభుత్వం కూడా పేదలకు అందించిన చరిత్ర లేదన్నారు. అనంతరం 19, 20 వార్డుల్లో సిమెంట్ రోడ్లు, సైడు కాలువల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తొలుత 19వ వార్డు కౌన్సిలర్ పాలపర్తి వెంకట్రావు, 20వ వార్డు కౌన్సిలర్ గంగిరెడ్డి ఇందిర సుందర రామిరెడ్డి ఆధ్వర్యంలో బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు.

బాణసంచా కాలుస్తూ డప్పు వాయిద్యాలతో ఎస్ఎస్‌పీ కాలనీ, గరికమిట్ట ప్రాంతాల్లో వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, స్థానిక కౌన్సిలర్‌లు గంగిరెడ్డి ఇందిర సుందరరామిరెడ్డి, పాలపర్తి వెంకట్రావు, స్థానిక పార్టీ నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించండి

చీమకుర్తి: చీమకుర్తిలోని సీహెచ్‌సీ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుతో కలిసి మంగళవారం ఆస్పత్రిలో స్థానిక డాక్టర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రభుత్వ నిధులు రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన ఆటో ఎనలైజర్ ల్యాబ్ ఎక్విప్‌మెంట్‌ను ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. ఆటో ఎనలైజర్ ఎక్విప్‌మెంట్ ద్వారా రక్తపరీక్షలు, మూత్రపరీక్షలు, షుగర్ పరీక్షలతో పాటు కిడ్నీలు, ఫ్యాట్ వంటి దాదాపు 75 రకాలకు చెందిన పరీక్షలను నిర్వహించవచ్చని డాక్టర్ వేణుగోపాల్ వారికి తెలిపారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రి భవనంపై మరో అంతస్తు వేసేందుకు అవకాశాలను పరిశీలించాలని, ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి జీతాల చెల్లింపులు, డాక్టర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఆస్పత్రి బయట బూచేపల్లి సుబ్బారెడ్డి పేరుతో ఆర్చి ఏర్పాటు చేసినందుకు డాక్టర్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, కమిషనర్ షేక్ ఫజులుల్లా, గోపురపు చంద్ర, స్థానిక ఆస్పత్రి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

గ్రీన్‌బెల్ట్‌ను ఆధునికీకరిస్తున్నాం

- రోడ్డు మార్జిన్‌లో తొలగిస్తున్న ఆక్రమణలను పరిశీలించిన కమిషనర్
- నగరంలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని రామ్‌నగర్ ఒకటో లైన్ నుంచి 10వ లైన్ వరకు ఉన్న గ్రీన్ బెల్ట్‌ను ఆధునీకరించనున్నట్లు ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రామ్‌నగర్‌లోని రోడ్డు మార్జిన్‌లోని ఆక్రమణల తొలగింపు ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆక్రమిత షాపులు, కట్టడాలను అన్నింటినీ తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్‌లు, ఫుట్‌పాత్ నిర్మాణాలకు రూ.1.80 కోట్లు మంజూరయ్యారన్నారు. అదేవిధంగా ఎన్‌క్యాప్ నిధులు అదనంగా మరో రూ.65 లక్షలతో గ్రీన్‌బెల్ట్ ఆధునికీకరిస్తారన్నారు. ఆక్రమణల తొలగింపు తరువాత పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

రోడ్లమీద పశువులను కట్టేసి అపరిశుభ్రం చేస్తే ఊరుకోం:

సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, మట్టి రోడ్లపై పశువులను కట్టేసి పేడలు వేయించి అపరిశుభ్రం చేస్తే ఊరుకునేది లేదని సంబంధిత వర్గాలవారిని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఈ మేరకు కమిషనర్ మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నగరంలోని కమ్మపాలెం, కరవది డొంక, గోపాల్ నగర్, ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ గృహ కల్ప ప్రాంతాల్లో పర్యటించారు. రోడ్లమీద పశువులను కట్టేసి పేడతో పాటు పశుసంబంధిత వ్యర్థాలతో అపరిశుభ్రం చేస్తున్నారని గుర్తించారు. దీంతో సంబంధిత వ్యక్తులతో రోడ్లను అపరిశుభ్రం చేయరాదని సూచించారు. అపరిశుభ్రం చేస్తే జరిమానాలు విధించి పశువులను బందీల దొడ్లకు తరలిస్తామని హెచ్చరించారు. రోడ్ల వెంట, సైడు కాలువల్లో వ్యర్థాలను పడేస్తున్నారని, ఆ విధంగా చేయటం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను ఇళ్లవద్దకు వచ్చే క్లాప్ ఆటోకి మాత్రమే ఇవ్వాలని రోడ్ల మీద పడేయరాదన్నారు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. మూడు బుట్టల చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన పెంచాలని సిబ్బందికి సూచించారు. క్లాప్ యూజర్ చార్జీలను నోడల్ ఆఫీసర్లు వసూలు చేయించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి వలంటీర్‌ను యూజర్ ఫీజు వసూళ్లలో ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. రాజీవ్ గృహకల్ప ఆరో లైన్‌లో చేస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, లేకుంటే బిల్లులు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు.



రామ్‌నగర్‌లోని గ్రీన్ బెల్ట్‌ను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

రైలు ప్రమాద మృతులకు సాహితీవేత్తల నివాళి

ఒంగోలు టౌన్: ఒడిశా రైలు ప్రమాదంలో అసువులు బాసిన వందలాది మృతులకు ఒంగోలుకు చెందిన కవులు, కళాకారులు, రచయితలు నివాళి అర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో మంగళవారం సంతాప సభ నిర్వహించారు. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం చాలా దురదృష్టమని నవ్యాంధ్ర రచయితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ విచారం వ్యక్తం చేశారు. ప్రమాద దృశ్యాలు మనసును కలిచి వేస్తున్నాయని, కనీవినీ ఎరుగని ప్రమాదంతో దేశం యావత్తు ఉలిక్కి పడిందన్నారు. సీబీఐ విచారణలో మానవ తప్పిదమని తేలితే దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సంతాప సభలో సాహితీవేత్తలు డాక్టర్ నూనె అంకమరావు, కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లికార్జునరావు, జ్యోతిర్మయి, యూవీ రత్నం, ఓరుగంటి ప్రసాద్, రవి కుమార్, నాళం నరసమ్మ, శాంతిలత, కనకదుర్గ, జీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు

మానసిక దివ్యాంగులకు కిట్లు

మార్కాపురం: జిల్లాలోని మానసిక దివ్యాంగులకు ఉచితంగా కిట్లు అందిస్తామని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు డి. గోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానసిక దివ్యాంగుల వికాసానికి తోడ్పడే ఈ కిట్ల కోసం కావాల్సిన వారు 73829 12753 నంబర్‌కు తమ దరఖాస్తులు వాట్సాప్ చేయాలని తెలిపారు. ఆధార్ కార్డ్, వైట్ రేషన్ కార్డు, దివ్యాంగుల సర్టిఫికెట్లు, ఎస్సీ, ఎస్టీలు కుల ధ్రువీకరణ పత్రాలు, వార్షికాదాయం సంవత్సరానికి రూ.2.70 లక్షల లోపు ఉండే ఆదాయ ధ్రువీకరణ పత్రం పంపాలని సూచించారు. 20 ఏళ్లలోపు మానసిక దివ్యాంగులకు మాత్రమే ఈ సదుపాయం వర్తిస్తుందని తెలిపారు. ఈ నెల 20లోపు తమ పేర్లు పంపాలని సూచించారు.

కరుణించమ్మా స్వర్ణమ్మ తల్లీ!

- వైభవంగా తిరునాళ్ల

కారంచేడు: కరుణించి, కాపాడమ్మా.. మా తల్లి.. స్వర్ణమ్మ తల్లీ అంటూ గ్రామస్తులు అమ్మవారికి శరణు వేడుకున్నారు. గతంలో సుమారు వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ళు మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, అడిగిందే తడవుగా వరాలు అందించే గ్రామ దేవతగా విరాజిల్లుతున్న స్వర్ణమ్మకు భక్తులు విశ్వాసంతో పూజిస్తారు. సోమవారం అమ్మవారికి గ్రామ ఆడపడుచులు ఎక్కడ ఉన్నా గ్రామానికి వచ్చి పుసుపు-కుంకమలు సమర్పించడం ఆనవాయితీ. ఈ క్రమంలో అందుబాటులో ఉండే ప్రతి ఒక్కరూ వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి స్వర్ణమ్మ తల్లికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి గ్రామ దేవతకు నైవేద్యాలను సమర్పించారు. ప్రతి సంవత్సరం వందలాది మంది భక్తులు పాల్గొనే స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ళను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ఘటాలను ఊరేగించారు. నియమ, నిష్టలతో కూడిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారి వాహనాలను ఆలయం చుట్టూ తిప్పుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 150 అడుగుల విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అమ్మవారి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు.



స్వర్ణలో పూజలందుకుంటున్న స్వర్ణమ్మ తల్లి

సీఎం రిలీఫ్ ఫండ్‌ను వినియోగించుకోవాలి

మార్కాపురం: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన నగదును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులు కావాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని మార్కాపురం, కొనకనమిట్ల మండలాలకు చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. మొత్తం రూ.15.25 లక్షల చెక్కులు అందించారు. ఇందులో కొనకనమిట్ల మండలం చినమనగుండం గ్రామానికి చెందిన మన్నం శివమ్మకు రూ.7 లక్షలు, మార్కాపురం పట్టణానికి చెందిన కురిచేటి ఆంజనేయులుకు రూ.1.60 లక్షల చెక్కు అందించారు. కొనకనమిట్ల మండలం నాగంపల్లికి చెందిన నవ్యకు రూ.2.30 లక్షలు, వాగుమడుగు చెందిన తమ్మిశెట్టి అంజమ్మకు రూ.55 వేలు, బొందలపాడుకు చెందిన కోటయ్యకు రూ.30 వేలు, పొదిలి మండలం సూధనగుంట గ్రామానికి చెందిన పవిత్రకు రూ.3.50 లక్షలు అందించినట్లు ఎమ్మెల్యే కేపీ చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు యా.శ్రీనివాసులు, బ్రహ్మయ్య, కోలగట్ల శివారెడ్డి, యల్లకర రంగయ్య పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మద్దిపాడు మండల నాయకులనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

కలిసికట్టుగా పనిచేద్దాం

- వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చేద్దాం
- జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కలిసికట్టుగా పనిచేద్దాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి మద్దిపాడు మండల వైఎస్సార్‌సీపీ నాయకులను కోరారు. మంగళవారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో మద్దిపాడు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శివప్రసాదరెడ్డితో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పాల్గొన్నారు. మద్దిపాడు మండలంలోని పార్టీ స్థితిగతులు, సంస్థాగత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటి గడపను తాకాయని, పథకాల లబ్ధిదారులను రానున్న ఎన్నికల్లో ఓట్లుగా మలచుకొని పార్టీ గెలుపు కోసం పనిచేయాలని బూచేపల్లి శివప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. మద్దిపాడు మండల పార్టీ నాయకులకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అండగా ఉంటారని, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పార్టీ నాయకుల అభీష్టం మేరకు పనిచేసి అందరికీ అందుబాటులో ఉంటారని బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, జెడ్పీటీసీ భర్త తేళ్ల పుల్లారావు, మండల పార్టీ కన్వీనర్ మండవ అప్పారావు, పార్టీ నాయకులు గట్టినేని అయ్యన్న, పోతినేని శ్రీనివాసరావు, మూరబోయిన విజయలక్ష్మి సంజీవరావు, పీ.వెంకట్రావు, బత్తుల శ్రీను, నర్రా సురేష్, నారా విజయలక్ష్మి, ఎస్ రమణమ్మ, స్థానికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

వలంటీర్లు స్వచ్ఛంద సేవకులు



సన్మానించిన వలంటీర్లతో మేయర్ గంగాడ సుజాత

- కరోనా సమయంలో మీ సేవలు మరువలేనివి
- ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: వలంటీర్లు స్వచ్ఛంద సేవకులని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత కొనియాడారు. ఈ మేరకు స్థానిక వెంగముక్కల పాలెం వార్డు సచివాలయం పరిధిలోని వలంటీర్లను మంగళవారం మేయర్ సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. కరోనా సమయంలో ప్రజలకు వలంటీర్లు చేసిన సేవలు మరువలేనివన్నారు. మన రాష్ట్రంలోని వలంటీర్లకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయటంలో వలంటీర్లు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. అందుకే ప్రభుత్వం వలంటీర్లను సత్కరించే కార్యక్రమాన్ని చేపట్టిందని వెల్లడించారు. ఈ సందర్భంగా మేయర్ గంగాడ వలంటీర్లను శాలువాలతో సత్కరించి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.

వ్యవసాయ పనులు ప్రారంభం



పొలంలో కలుపు తీస్తున్న రైతు

కొత్తపట్నం: మండలంలో ఈ సీజన్‌లో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. ఇసుక నేలల్లో నీటి బోర్ల కింద వేరుశనగ, చామదుంపల విత్తనాలు యద పెడుతున్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు విత్తనాలు వేయవద్దని సూచించినా రైతులు పట్టించుకోవడం లేదు. విద్యుత్ మోటర్‌తో బోరునీళ్లు ఉపయోగించి మినీ స్ప్రింక్లర్లతో ముందుగా తడిపి చల్లదనం తీసుకొచ్చిన తరువాత విత్తనాలు యద పెడుతున్నారు. అదునులో యదపెడితే దిగుబడులు ఎక్కువగా వస్తాయని ఆశిస్తున్నారు. దీంతో జూన్ మొదటి వారం నుంచి ప్రారంభించారు. మండలంలో కొత్తపట్నం, కె.పల్లెపాలెం, పాదర్తి, రంగాయపాలెం, మోటుమాల, గమళ్లపాలెం, రాజుపాలెం, వజ్జిరెడ్డిపాలెం, ఈతముక్కల, మడనూరు గ్రామాల్లో 6 వేల ఎకరాల్లో వేరుశనగ, 2 వేల ఎకరాల్లో చామదుంప విత్తనాలు యద పెట్టారు. జూన్ నెల రెండో వారంలో చిరు జల్లులు పడతాయని పైరు బాగా పెరుగుతుందని ఆశిస్తున్నారు. ఇప్పటికే మూడొంతుల మంది రైతుల పొలాల్లో మొలకలు కూడా వచ్చాయి. దీనితో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ 50 శాతం సబ్సిడీతో ఇచ్చి జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను నెల రోజుల క్రితం యద పెట్టారు. భూమి సారవంతం చేసి రెండుసాళ్లు దుక్కిదున్నారు. ఆపైన విత్తనాలు యద పెట్టారు. రైతులకు కావాల్సిన ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. కొంత మంది రైతులు ముందుగా వేసిన పైరులకు పంటలను ఈ క్రాప్ చేసేందుకు పొలంలోకి వెళ్లి పరిశీలిస్తున్నారు. ఈ ఏడాది దిగుబడులు అధికారికంగా ఉంటాయని ఆశిస్తున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762 90102 02856
Office mail : sakshiongads@gmail.com